క్లుప్తంగా

చదువు సంస్కారాన్ని నేర్పిస్తుంది



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నిర్వాహకులు

కందుకూరు: చదువు సంస్కారాన్ని నేర్పిస్తుందని ఎంఈఓ మనోహర్ అన్నారు. మండల పరిధిలోని అన్నోజిగూడ ప్రభుత్వ పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ రాజనారాయణ సూచనతో ఆ సంస్థ కోఆర్డీనేటర్ ఢిల్లీ శివ కుమార్, నరేందర్ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. బదిలీపై వెళ్తున్న హెచ్ఎం శ్రీశైలం, ఉపాధ్యాయులు వెంకటస్వామి, సత్యవాణిలను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఇక్కడికి బదిలీపై వచ్చిన హెచ్ఎం అబ్దుల్ రహీం, ఉపాధ్యాయులు జి.అంజయ్య, జయమాలినిలకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకునేలా బోధన చేపట్టాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజనీదేవి, సరిత, విజయ, ఎస్ఎంసీ చైర్మన్ శోభ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించిన అధికారులు



జేసీబీతో చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

బడంగ్‌పేట్: బాలాపూర్ పరిసరాల్లో రోడ్డు పక్కన వేసిన చెత్తను అధికారులు గురువారం సిబ్బందితో తరలించారు. ఈ మేరకు 'పరిశుభ్రత లోపించి.. దుర్గంధం వ్యాపించి' అనే శీర్షికన 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనికి బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి సిబ్బందితో వచ్చి జేసీబీ సాయంతో పేరుకుపోయిన చెత్తను ట్రాక్టర్లలోకి ఎక్కించి అక్కడి పరిసరాలను శుభ్రం చేయించారు. బోనాల పండగకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తామన్నారు. డిప్యూటీ మేయ ర్ ఇబ్రాం శేఖర్ విచ్చేసి పనులను పరిశీలించారు. చెత్త డంపింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

'సబితారెడ్డిని విమర్శించడం మానుకోవాలి'



మాట్లాడుతున్న లక్ష్మయ్యయాదవ్, పక్కన నాయకులు

మహేశ్వరం: సబితారెడ్డి దయతో తుక్కుగూడ మున్సిపాలిటీకి చైర్మన్ అయిన సంగతి మరిచిన మధుమోహన్, ఇప్పుడు ఆమెనే విమర్శించడం విడ్డూరంగా ఉందని మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు లక్ష్మయ్యయాదవ్ అన్నారు. గురువారం తుక్కుగూడలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల చేత గెలుపొందిన ప్రజాప్రతినిధులు, చైర్మన్, కౌన్సిలర్లను సబితారెడ్డి అన్ని విధాలా గౌరవించి కార్యక్రమాలు చేయించారన్నారు. సబితారెడ్డి అన్ని కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించారన్నారు. చైర్మన్ అప్పటి మంత్రి సబితారెడ్డితో సమన్వయంతో ఉండకపోవడంతో మున్సిపాలిటీలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. సబితమ్మను, బీఆర్ఎస్ నేతలను విమర్శించడం మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, బుచ్చిరెడ్డి, సామెల్‌రాజ్, రమేష్, మల్లేష్, వెంకట్‌రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూసారంబాగ్‌లో కార్పొరేటర్ పర్యటన

మలక్‌పేట: మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి గురువారం డివిజన్‌లో పర్యటించారు. బోనాల పండుగ నేపథ్యంలో ఆయా కాలనీలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ఆలయాల వద్ద జరుగుతున్న ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతానన్నారు. ఆలయాల వద్ద కొనసాగుతున్న పనుల్లో జాప్యం లేకుండా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆలయ నిర్వాహకులు, కాలనీవాసులు సమన్వయంతో బోనాలు పండుగ ఘనంగా జరుపుకోవాలని సూచించారు. కార్పొరేటర్ వెంట సైట్ ఇంజినీర్ ఏడుకొండలు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, నాయకులు సంతోష్, దినేష్ ఉన్నారు.

ట్రాలీల్లో తరలించి.. సుదూరానికి చేర్చి

దంపింగ్‌యార్డు లేక ఇబ్బంది పడుతున్న సిబ్బంది

- మీర్‌పేట చెత్తను ఉప్పల్‌కు తరలిస్తున్న వైనం
- నత్తనడకన సాగుతున్న డంపింగ్‌యార్డు నిర్మాణం



కుర్మల్‌గూడలో అసంపూర్తిగా డంపింగ్‌యార్డు

మీర్‌పేట: డంపింగ్‌యార్డు లేక పారిశుద్ధ్య కార్మికులు, చెత్త తరలించే సిబ్బంది తీవ్ర అవస్థలు పడుతున్నారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో డంపింగ్‌యార్డు లేకపోవడంతో సుదూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి ప్రత్యేకంగా బడంగ్‌పేట కుర్మల్‌గూడలో రూ.కోటి అంచనా వ్యయంతో డంపింగ్ యార్డు కోసం ఎకరంన్నర స్థలాన్ని కేటాయించి గత సంవత్సరం శంకుస్థాపన చేశారు. గత కొన్నేళ్లుగా మీర్‌పేట శానిటేషన్ సిబ్బంది సేకరించిన చెత్తను ఉప్పల్‌లోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించడంతో పాటు ఆ వ్యర్థాలను ఎనిమిది కిలో మీటర్ల దూరాన ఉన్న ఉప్పల్‌కు తరలించడంతో సమయం వృథా అవుతుంది. దీంతోపాటు వాహనాల డీజిల్ ఖర్చులు అదనంగా ఉంటాయి. వీటితో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది వాపోతున్నారు. ప్రతి రోజు కార్పొరేషన్ నుంచి 46 ఆటోలు, ఐదు ట్రాక్టర్లలో చెత్తను డంపింగ్‌కు తరలిస్తుంటారు. ట్రాఫిక్‌తో పాటు చెత్తను డంప్ చేసేందుకు గంటల కొద్ది వాహనాలను నిలపాల్సి వస్తోందని, కొన్నిసార్లు ట్రాక్టర్లు నడిపే డ్రైవర్లు ప్రమాదాలకు గురైన సంఘటనలు చాలా ఉన్నాయని సిబ్బంది తెలిపారు.

అసంపూర్తిగా నిర్మాణం

సంవత్సరం క్రితం ప్రారంభమైన డంపింగ్ యార్డు నిర్మాణం పనులు అసంపూర్తిగానే ఉన్నాయని, ఎప్పుడు పూర్తవుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొందని పారిశుద్ధ్య సిబ్బంది అన్నారు. ఇదిలా ఉండగా డంపింగ్ యార్డు నిర్మాణాన్ని కుర్మల్‌గూడతో పాటు స్థానిక ప్రజలు కూడా వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. పెండింగ్ పనులను పూర్తి చేసి త్వరితగతిన డంపింగ్‌యార్డును అందుబాటులోకి తెచ్చేలా కార్పొరేషన్ అధికారులు చొరవ తీసుకోవాలని సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు.

70 శాతం పనులు పూర్తి

డంపింగ్ యార్డు నిర్మాణా నికి రూ.30 లక్షలు ప్రభుత్వం కేటాయించింది. ఇప్ప టికే చుట్టూ ఫెన్సింగ్, షెడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యా యి. రీ సైక్లింగ్ మిషన్ పను లు పూర్తి కావాల్సి ఉంది. త్వరలోనే డంపింగ్ యా ర్డు నిర్మాణ పనులు పూర్తి చేసి సిబ్బందికి ఇబ్బంది లేకుండా చూస్తాం.

– శ్రీనివాసులు, ఏఈ, మీర్‌పేట కార్పొరేషన్



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నినాదాలు చేస్తున్న కార్మికులు

సమస్యలు పరిష్కరించండి

- కొనసాగుతున్న మధ్యాహ్న భోజన కార్మికుల నిరసనలు

కందుకూరు: తమ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం నాలుగో రోజుకు చేరింది. అందులో భాగంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు నరసింహా మద్దతుగా పాల్గొని మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులు 22 ఏళ్లుగా విద్యార్థులకు వంట చేసి పెడుతున్నా ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. పదేళ్ల క్రితం ఉన్న ధరల మేరకే బిల్లులు చెల్లించడం ఏంటని ప్రశ్నించారు. వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో అందరితో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం అధ్యక్షకార్యదర్శులు శ్రీను, ప్రభావతి, సభ్యులు ఇందిరమ్మ, స్వాతి, హైమావతి, ప్రమీల, బాలమణి, అమూర్త, మంగమ్మ, శోభ, భాగ్యమ్మ, శంకరమ్మ, సుగుణ, మంజుల, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతుల కల్పనకు వినతి

మలక్‌పేట: ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఏఐఎస్ఎఫ్ నాయకులు సైదాబాద్ డిప్యూటీ ఐఓఎస్ వరప్రసాద్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, హైదాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్యయాదవ్ మాట్లాడుతూ.. సర్కార్ బడుల్లో సరైన వసతులు లేక విద్యార్థులు, ముఖ్యంగా బాలికలకు బాత్రూమ్ శుభ్రంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. గదిలో బెంచీలు లేక నేలమీద కూర్చుని పాఠాలు వినాల్సి వస్తోందన్నారు. పాఠశాలలో ఫోర్త్ క్లాస్ ఉద్యోగుల కొరత ఉందని, వాటిని భర్తీ చేయాలన్నారు. పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని అధికారులను కోరినట్లు తెలిపారు.



జీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్‌లోని శ్మశానవాటిక

ఆఖరి మజిలీకి అన్నీతామై..

- దహన సంస్కారాలకూ ప్యాకేజీ
- అడిగిన డబ్బులిస్తే అన్ని పనులు వారే..
- నగరంలోని పలు శ్మశానవాటికల్లో ఇదే తరహా

వనస్థలిపురం: విదేశాలు, విహారయాత్రలకు వెళ్లాలన్నా ఆయా సంస్థలు ట్రావెలింగ్, వసతి, భోజనం తదితర ఏర్పాట్లతో ప్రత్యేక ప్యాకేజీలను ఇస్తుండటం సర్వ సాధారణం. అదే విధంగా నగరంలో ఓ వ్యక్తి చనిపోతే దహన సంస్కారాల కోసం కొన్ని శ్మశాన వాటికల్లో నిర్వాహకులు ప్రత్యేక ప్యాకేజీని ఇస్తున్నారు. వారు నిర్ణయించిన ప్రకారం డబ్బులు చెల్లిస్తే ఇంటి నుంచి శ్మశానవాటికకు శవాన్ని తరలించడం మొదలు అంత్యక్రియల నిర్వహణ బాధ్యత పూర్తిగా వారే చూసుకుంటున్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో సాహెబ్‌నగర్ శ్మశాన వాటిక, కర్మన్‌ఘాట్ భూపేశ్‌గుప్తానగర్ శ్మశాన వాటికల్లో ఈ ప్యాకేజీలు కొనసాగుతున్నాయి. డబ్బులు ఖర్చయినా అంత్యక్రియల సందర్భంగా సామగ్రి, వాహనం, బ్యాండ్, లేబర్, పూలు తదితర ఏర్పాట్ల కోసం నలుదిక్కులా తిరగాల్సిన పని లేకుండా ఓ ప్యాకేజీతో అన్నిపనులు శ్మశానవాటిక నిర్వాహకులే చూస్తుండడంతో శ్రమ తప్పుతుందని పలువురు చెబుతున్నారు.

సాహెబ్‌నగర్ శ్మశాన వాటికలో రూ. 33 వేలు..

వనస్థలిపురం సాహెబ్‌నగర్ శ్మశానవాటికలో రూ. 33 వేలతో అంత్యక్రియల నిర్వహణ చేపడుతున్నారు. ఎవరైనా చనిపోతే నిర్వాహకులకు ముందుగా సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో వారు ఇంటి వద్దకు పరమపద రథం (వ్యాన్)ను పంపించడంతో పాటు పాడే కట్టే సిబ్బంది, పూజ సామగ్రిని, బ్యాండ్ మేళాన్ని పంపిస్తారు. శవాన్ని తరలించే వ్యాన్‌ను పూలతో అలంకరిస్తారు. అనంతరం శవాన్ని శ్మశాన వాటికకు తరలించి అక్కడ దహన సంస్కారాలు నిర్వహిస్తారు. ఇక్కడ దహన సంస్కారాలు చేసిన వారికి బరెల్ గ్రౌండ్ రిపోర్ట్ ఇస్తారు. దీని ద్వారా వారు మున్సిపాలిటీ నుంచి డెత్ సర్టిఫికేట్(మరణ ధ్రువీకరణ పత్రం) తీసుకోవచ్చు.

ఇతర ఖర్చులు వేరే...

దహన సంస్కారాలు రూ. 33 వేల ప్యాకేజీతో అయిపోయినా ఇతర ఖర్చులు మరికొన్ని ఉంటాయి. దశ దిన సందర్భంగా గుండ్లు కొట్టించడానికి ఇక్కడ ఒక్కో గుండుకు రూ. 300 చొప్పున నాయీ బ్రాహ్మణులు వసూలు చేస్తారు. అలాగే గాజులు తీయడం, బట్టలు ఉతకడానికి చాకలికి రూ. 2000 చెల్లించాలి. ఇక చావు రోజు, మూడో, పదో రోజు ఖర్మకాండం సందర్భంగా అయ్య వారికి ఓ ప్యాకేజీగా రూ. 10,000 నుంచి 15,000 వరకు ఇవాల్సి ఉంటుంది.

ఏర్పాట్లన్నీ మేమే చేస్తాం..

ఎవరైనా చనిపోతే తమకు ముందుగా సమాచారం ఇస్తే అన్ని ఏర్పాట్లు మేమే చేస్తాం. రూ. 33 వేల ప్యాకేజీతో వాహనాన్ని పంపించడం మొదలు, పాడే కట్టడం,పాడే సామగ్రి, వాహనం అలంకరణ, దహన సంస్కారం మొత్తం మేమే చేస్తాం. ఎవరైనా పేదవారు వారే శవాన్ని తీసుకుని నేరుగా వస్తే వారికి జీహెచ్ఎంసీ నిర్ణయించిన ఫీజు ప్రకారం కట్టెలు, లేబర్ కోసం రూ. 8 వేలు తీసు కుని దహన సంస్కారాలు నిర్వహిస్తాం. ఇక్కడ దహన సంస్కారాలు చేసిన వారికి మేమే బరెల్ గ్రౌండ్ రిపోర్ట్ ఇస్తాం, దీని ద్వారా వారు మున్సిపాలిటీ నుంచి డెత్ సర్టిఫికెట్ తీసుకోవచ్చు. అలాగే మా వద్ద అస్థికల కోసం ఉచిత లాకర్ సౌకర్యం ఉంది.

– వి.జగదీష్, ఇన్‌చార్జి, సాహెబ్‌నగర్ శ్మశానవాటిక

ఆలయ నిర్మాణానికి రూ.25 లక్షల విరాళం

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలో టీచర్స్ కాలనీలోని ఆంజనేయస్వామి దేవాలయంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి అభయ అయ్యప్ప సేవా సమితి సభ్యులు రూ.25 లక్షల విరాళాన్ని ప్రకటించారు. గురువారం సాగర్ కాంప్లెక్స్ రేణుక రాజరాజేశ్వరీ పీఠం శ్రీనవీన్ శర్మ, స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సమక్షంలో రూ.5 లక్షల చెక్కును ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. దేవాలయ నిర్మాణానికి రూ.25లక్షలు విరాళం ఇవ్వడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు వల్లపురెడ్డి, ఉపాధ్యక్షులు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గణేష్, ఆలయ చైర్మన్ కొండల్‌రెడ్డి, కార్యదర్శి బుచ్చిరెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, రవీందర్‌రెడ్డి, ఆదిత్యశర్మ, విష్ణువర్ధన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ నీటి బిల్లుల రద్దుకు ధర్నా

నాగోలు: బకాయి తాగునీటి బిల్లులను రద్దు చేయాలని బండ్లగూడ వద్ద ఉన్న రాజీవ్ స్వగృహా (సహభావన టౌన్‌షిప్)సీ–బ్లాక్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ వాసులు గురువారం బండ్లగూడ తట్టిఅన్నారం రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. 2023లో తమకు ఈ ప్లాట్లు విక్రయించారని అంతకు ముందున్న వారు నీటిని వాడుకొని బిల్లు కట్టలేదన్నారు. గతంలోని పెండింగ్ బిల్లులు తమను కట్టాలని జలమండలి అధికారులు నోటీసులు జారీ చేశారని కట్టకుంటే నీటి కనెక్షన్ తొలగిస్తామని వేధిస్తున్నారన్నారు. గతంలో రాజీవ్ స్వగృహా అధికారులు పెండింగ్ బిల్లు చెల్లిస్తామని హామీ ఇచ్చారని ఇప్పుడు పట్టించుకోవడం లేదని అన్నారు. ధర్నా విషయం తెలుసుకున్న రాజీవ్ స్వగృహా ప్రాజెక్ట్ జనరల్ మేనేజర్ స్పందించి జలమండలి ఎండీతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 1.10 కోట్లు బకాయిలను రద్దు చేయాలని లేకుంటే రాస్తారోకోలు, ర్యాలీలు చేస్తామని హెచ్చరించారు.

రైతు రాజ్యమే లక్ష్యంగా పాలన

- ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేశాం
- మాజీ ఎమ్మెల్యేలు కేఎల్ఆర్, కృష్ణారెడ్డి



మహేశ్వరం: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు కేఎల్ఆర్, తీగల తదితరులు

మహేశ్వరం: రైతు సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం పని చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యేలు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, తీగల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని దుబ్బచర్ల గ్రామంలో రైతు వేదిక వద్ద రైతులకు రుణమాఫీ చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రైతులతో కలిసి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటి అమలు చేస్తూ ప్రజాపాలన అందిస్తున్నారన్నారు. కాంగ్రెస్ మాట ఇస్తే శిలాశాసనం మరోసారి రుజువైందన్నారు. తొలి విడతలో రూ.లక్ష లోపు రైతు రుణాల మాఫీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారన్నారు. నియోజకవర్గంలో రూ.26 కోట్లకు పైగా రుణమాఫీ జరిగిందన్నారు. సుమారు 5 వేల మంది రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. మహేశ్వరం మండలంలో 2,034 మంది రైతులకు రూ.10.75 కోట్లు, కందుకూరులో 2,848 రైతులకు రూ.15.50 కోట్లు రుణమాఫీ జరిగిందన్నారు. బాలాపూర్ మండలంలో 118 మంది రైతులకు రూ.55.18 లక్షల రుణమాఫీ చేశారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్ పర్సన్ తీగల అనితారెడ్డి, పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్ రెడ్డి, నాయకులు ఈశ్వర్‌ముదిరాజ్, ఇబ్రాయేల్, యాదయ్య, రఘుపతి, జంగయ్య, లక్ష్మీనారాయణగౌడ్, కృష్ణానాయక్, బాల్‌రాజ్, పాండునాయక్, రాఘవేందర్‌రెడ్డి, కుమార్‌యాదవ్, రంజిత్, ప్రశాంత్‌రెడ్డి, విఠల్‌నాయక్, అంజయ్య, నర్సింహ, ప్రవీణ్, కృష్ణనాయక్, గోపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కందుకూరు: ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందని మాజీ ఎమ్మెల్యేలు కేఎల్ఆర్, తీగల కృష్ణారెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి కొనియాడారు. గురువారం మండలంలోని కొత్తగూడ రైతు వేదికలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన రుణమాఫీ కార్యక్రమాన్ని వీడియో తెర ద్వారా వీక్షించారు. అనంతరం కందుకూరు చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి కార్యకర్తలు చెప్పాలన్నారు. అందరికి ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు రాజీనామాకు సిద్ధం కావాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో లక్షల కోట్లు దోచుకున్నారని, తమ ప్రభుత్వం మాత్రం పేదలు, రైతుల పక్షపాతిగా పాలన సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, రాష్ట్ర నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సరికొండ మల్లేష్, పార్టీ మాజీ అధ్యక్షులు కృష్ణనాయక్, రాణాప్రతాప్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సత్యనారాయణ, భూపాల్‌రెడ్డి, పాండు, రాంరెడ్డి, అఫ్జల్ బేగ్, హన్మంత్‌రెడ్డి, సాయిలు, యుగంధర్, పాండు రంగారెడ్డి, మధన్‌పాల్‌రెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకుంది

మీర్‌పేట/బడంగ్‌పేట్: రుణమాఫీ విషయంలో రైతులకు ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. తొలి విడతలో రూ.లక్ష వరకు ఉన్న రైతులకు రుణమాఫీ చేసిన సందర్భంగా గురువారం మీర్‌పేట కూడలిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ శ్రేణులు పాలాభిషేకం చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. రైతుల రుణమాఫీ దేశ రాజకీయ చరిత్రలో నిలిచిపోతుందని, 11 లక్షల రైతుల ఖాతాల్లో రూ.6,089 కోట్ల రుణమాఫీ నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బాలమణి, నాయకులు దశరథ, సురేందర్‌రెడ్డి, యాదిరెడ్డి, వెంకటేష్‌గౌడ్, గంగమ్మ, పద్మ పాల్గొన్నారు.



కందుకూరు: కొత్తగూడలో రుణమాఫీ కార్యక్రమాన్ని రైతులతో కలిసి వీక్షిస్తున్న కేఎల్ఆర్, తీగల తదితరులు



మీర్‌పేట: కూడలిలో సంబరాల్లో పాల్గొన్న చల్లా నర్సింహారెడ్డి తదితరులు

కబ్జాదారుల నుంచి స్థలాన్ని కాపాడాలి



డీసీకి వినతిపత్రం ఇస్తున్న నర్సింహగుప్తా

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ భవానీనగర్ కాలనీలో కబ్జా అయిన స్థలాన్ని కాపాడి కాలనీవాసులకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని స్థానిక కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా ఆధ్వర్యంలో కాలనీవాసులు జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుజాతకు వినతిపత్రం ఇచ్చారు. కాలనీలోని 350 గజాల స్థలాన్ని ఆక్రమించుకుని ఇంటి నిర్మాణానికి అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నారని డీసీ దృష్టికి తీసుకొచ్చారు. కబ్జాదారుడు దరఖాస్తును రద్దు చేసి స్థానికులకు ఉపయోగపడేలా చూడాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో శ్రీకాంత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సంతోష్, జి.లక్ష్మీనారాయణ, వెంకట్‌రెడ్డి, చిన్నా, రవీందర్‌రెడ్డి, నాయకులు వినోద్‌యాదవ్, రామ్మోహన్ ఉన్నారు.

డీసీకి కార్పొరేటర్ వినతి

చైతన్యపురి: డివిజన్‌లోని పలు కాలనీలలో ఉన్న ప్రైవేటు హాస్టళ్లతో తలెత్తుతున్న సమస్యల పరిష్కారానికి హాస్టల్ యజమానులతో సమావేశం ఏర్పాటు చేయాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి గురువారం సరూర్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుజాతకు వినతిపత్రం ఇచ్చారు. ఎలాంటి అనుమతులు లేకుండా వివిధ కాలనీలలో అక్రమంగా హాస్టల్స్ నడుపుతున్నారని, వీటితో శానిటేషన్, డ్రైనేజీ, పార్కింగ్ సమస్యలతో పాటు లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి స్థానికులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని డీసీని కోరారు.